# ఎస్సీ కాలనీకి తాగునీటి కష్టాలు

- పది నెలలుగా రాని మిషన్ భగీరథ నీళ్లు
- వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లి తెచ్చుకుంటున్న కాలనీవాసులు
- ఎంత మొరపెట్టుకున్నా పట్టించుకోని అధికారులు

గణపురం, జనవరి 5 : భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సొంత మండలమైన గణపురంలోని దళిత కాలనీ ప్రజలు పది నెలలుగా మిషన్ భగీరథ నీళ్లు రాక గోసపడుతున్నారు. అధికారులకు విన్నవించుకుంటున్నా పట్టించుకోవడంతో కిలోమీటర్ల దూరం వెళ్లి.. ప్రైవేట్ బోరుబావుల నుంచి బిందెలతో తెచ్చుకొని దాహార్తిని తీర్చుకుంటున్నారు. ఈ విషయమై దళితకాలనీ మహిళలు సంబంధిత అధికారులకు గోడును విన్నవించుకోగా, ఎస్సీ కాలనీకి పైపులైన్ సమస్య ఉందని, పూర్తి కాగానే నీళ్లిస్తామని నిర్లక్ష్యపు సమాధానం చెబుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. పది నెలలుగా తాగునీళ్లు లేక వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లి తెచ్చుకుంటున్నామని, స్నానంతోపాటు దుస్తులు శుభ్రం చేసుకోవడానికి సైతం వ్యవసాయ బోర్లపైనే ఆధారపడాల్సి వస్తున్నదని పేర్కొన్నారు. ఇప్పటికైనా తమ గోడు విని, దాహార్తిని తీర్చాలని కాలనీప్రజలు వేడుకుంటున్నారు.



జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురంలోని దళితకాలనీలో ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న కాలనీవాసులు



### అధికారులు పట్టించుకోవడం లేదు

పది నెలలుగా మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి భగీరథ నీళ్లు రావడంలేదు. అనేకసార్లు గ్రామపంచాయతీ కార్యదర్శి, మిషన్ భగీరథ అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి దళిత కాలనీ ప్రజల సమస్యలను పరిష్కరించాలి.

- కట్ల ప్రశాంతీశంకరయ్య, మాజీ సర్పంచ్

## 8న విద్యుత్తు బీసీ ఉద్యోగుల మహాసభ

హైదరాబాద్, జనవరి 5 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ విద్యుత్తు బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం 19వ రాష్ట్ర మహాసభను 8న హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్టు రాష్ట్ర అధ్యక్షుడు కే కుమారస్వామి ప్రకటనలో తెలిపారు. ఖైరతాబాద్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ ఆడిటోరియంలో నిర్వహించనున్న మహాసభలో 2025 డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తామని పేర్కొన్నారు. ఎంపీలు ఈటెల రాజేందర్, ఆర్ కృష్ణయ్య ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్టు వెల్లడించారు.

## పల్లెల్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలి

**డీపీవోల సమీక్షలో మంత్రి సీతక్క**

హైదరాబాద్, జనవరి 5 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని ప్రతి పల్లెనూ ఆదర్శంగా తీర్చిదిద్దాలని పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లిప్తంగా ఉండొద్దని పేర్కొన్నారు. హైదరాబాద్ ఎర్రమంజిల్‌లోని గ్రామీణ మంచినీటి సరఫరా సెంట్రల్ ఆఫీసులో డీపీవోలతో ఆదివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో నిధుల వినియోగం, పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, అభివృద్ధి పనుల పురోగతిపై చర్చించారు. సమావేశంలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేశ్‌కుమార్, డైరెక్టర్ శ్రీజన తదితరులు పాల్గొన్నారు.

## రేపటి నుంచి సైన్స్ ఎగ్జిబిషన్

హైదరాబాద్, జనవరి 5 (నమస్తే తెలంగాణ) : విద్యార్థుల్లోని సైన్స్ ప్రతిభను వెలికితీసేందుకు, బాలశాస్త్రవేత్తలను గుర్తించేందుకు నిర్వహించే రాష్ట్ర స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌ను 7నుంచి 9 వరకు నిర్వహించనున్నట్టు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డి ప్రకటనలో తెలిపారు. జడ్చర్ల పోలేపల్లి సెజ్‌లోని ఎస్‌వీకేఎస్ స్కూల్‌లో నిర్వహించే ఈ ఎగ్జిబిషన్‌కు 830 మంది విద్యార్థులు హాజరుకానున్నట్టు పేర్కొన్నారు. ఈ ఎగ్జిబిషన్‌లో ప్రతిభ కనబరిచిన వారిని జాతీయస్థాయికి ఎంపికచేస్తామని తెలిపారు.



కరీంనగర్ జిల్లా రేకుర్తి కంటి దవాఖానలో వివరాలు అడిగి తెలుసుకుంటున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వేణుగోపాల్

## నేత్ర వైద్యశాలకు హైకోర్టు న్యాయమూర్తి విరాళం

విద్యానగర్, జనవరి 5: కరీంనగర్ జిల్లా కేంద్రంలోని రేకుర్తిలోని డాక్టర్ మడేకర్ లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ ఉదార నేత్ర వైద్యశాలకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఈవీ వేణుగోపాల్ రూ.లక్ష విరాళాన్ని ప్రకటించారు. ఆదివారం దవాఖానను సందర్శించిన ఆయన సౌకర్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. పేదప్రజల కంటి ఆపరేషన్ల కోసం తన తండ్రి, టెక్స్‌టైల్స్ అండ్ హ్యాండ్లూమ్స్ రిటైర్డ్ డిప్యూటీ డైరెక్టర్ రాజేశ్వర్‌రావు పేరిట రూ.లక్ష విరాళంగా అందిస్తున్నట్టు తెలిపారు. తెలంగాణ మలేషియా అసోసియేషన్ అధ్యక్షుడు సైదం తిరుపతి రూ.50 వేల విరాళం అందిస్తున్నట్టు ప్రకటించారు. పేద ప్రజలకు అండగా నిలిచేందుకు ముందుకు వచ్చిన జస్టిస్ వేణుగోపాల్, తిరుపతిని దవాఖాన యాజమాన్యం సత్కరించింది.



## పర్యాటక పటంలో కోటగుళ్లు, గణపసముద్రానికి చోటు

- టూరిజం శాఖ విడుదల చేసిన వీడియోలో స్థానం
- ప్రపంచవ్యాప్తంగా పర్యాటకశాఖ ప్రచారం

గణపురం, జనవరి 5 : పర్యాటకులను ఆకర్షించేందుకు పర్యాటక శాఖ చిత్రీకరించిన వీడియోలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురంలోని కాకతీయులు నిర్మించిన కోటగుళ్లు, గణపసముద్రం సరస్సు మత్తడికి చోటుదక్కింది. పర్యాటక అందాలు, వారసత్వ కట్టడాలుగా పేరొందిన గణపురం కోటగుళ్లు, గణప సముద్రాలకు రాష్ట్ర ప్రభుత్వం మొదటిసారి సముచిత స్థానం కల్పించింది. రామప్ప దేవాలయం, భూదాన్ పోచంపల్లి, యాదగిరిగుట్ట, పాండవుల గుట్ట, నాగార్జునసాగర్, జోడేఘాట్‌లోయ, నల్లమల, అమ్రాబాద్ టైగర్ రిజర్వ్, కిన్నెరసాని వైల్డ్ లైఫ్ శాంక్చురీ ప్రాజెక్టు, కుమ్రంభీం ప్రాజెక్టు, ఎస్సారెస్పీ (నందిపేట) వంటివి వీడియోలో ఉన్నాయి. సుమారు నిమిషం నిడివి గల వీడియోలో వీటిని పొందుపరిచారు.

## డిప్యూటీ సీఎం సభ అట్టర్‌ప్లాఫ్

- భట్టి మాట్లాడకుముందే వెళ్లిపోయిన జనం
- ఖాళీ కుర్చీలతో సభ వెలవెలా
- జనాలను ఆపే ప్రయత్నం చేసిన పోలీసులు

గీసుగొండ, జనవరి 5 : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదివారం గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ మొగిలిచెర్లలో నిర్వహించిన సభ అట్టర్ ప్లాఫ్ అయింది. విద్యుత్ ఉపకేంద్రాల శంకుస్థాపన అనంతరం నిర్వహించిన నియోజకవర్గస్థాయి బహిరంగ సభ జనాలు లేక వెలవెలబోయింది. డిప్యూటీ సీఎం సభను విజయవంతం చేయడానికి నాలుగు రోజులుగా పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి నియోజకవర్గంలోని 6 మండలాల్లో విస్తృతంగా పర్యటించారు. సభకు ప్రజలను భారీగా తరలించాలని స్థానిక నాయకులకు టార్గెట్లు పెట్టారు. నియోజకవర్గం నుంచి 4వేలమంది సభకు వచ్చి ఉంటారని స్థానిక నాయకులు చెబుతున్నారు. సభలో ఎమ్మెల్యే మాట్లాడుతుండగానే జనాలు వెళ్లిపోవడం మొదలు పెట్టారు. డిప్యూటీ సీఎం ప్రసంగించే సమయంలో ప్రజలంతా వెళ్లిపోయారు. పోలీసులు ప్రజలను ఆపే ప్రయత్నం చేసినా జనం మాత్రం ఆగలేదు. డిప్యూటీ సీఎం మాట్లాడుతుండగానే సభ ప్రాంగణమంతా ఖాళీ అయ్యింది. తన ఎకరం 16 గంటల భూమిని సబ్‌స్టేషన్ కోసం లాక్కున్నారని, మొగిలిచెర్ల గ్రామానికి చెందిన మహిళా రైతు మేడ వరలక్ష్మి డిప్యూటీ సీఎంను కలిసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకొని బయటకు పంపారు.



ఎల్‌ఈడీ స్క్రీన్‌లో డిప్యూటీ సీఎం ప్రసంగం, ఎదురుగా కనిపిస్తున్న ఖాళీ కుర్చీలు



ఉచిత కంటి వైద్యశిబిరంలో డ్రైవర్‌కు అద్దాలు అందిస్తున్న మంత్రి కోమటిరెడ్డి. చిత్రంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్

## రోడ్డు ప్రమాదాల నివారణకు చొరవ చూపాలి

- లారీ డ్రైవర్లకు మంత్రి కోమటిరెడ్డి సూచన
- హైవేపై డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు

చిట్యాల, జనవరి 5 : జాతీయ రహదారిపై ప్రమాదాలు జరగకుండా డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సూచించారు. జాతీయ రహదారిపై వెళ్లే భారీ వాహన డ్రైవర్ల కోసం నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వట్టిమర్తి వద్ద ఉన్న ఓ దాబా వద్ద ఆదివారం ఉచిత కంటి పరీక్షా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. హైదరాబాద్ – విజయవాడ రహదారిపై రోజూ 70 నుంచి 80 వేల వాహనాలు తిరుగుతున్నాయని, ఈ రహదారిపై ప్రమాదాలు నివారించేందుకు మొట్టమొదటిసారిగా జిల్లా యంత్రాంగం డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఎవరికైనా దృష్టిలోపం ఉంటే ఈ శిబిరంలో పరీక్షలు జరిపి తక్షణమే కళ్లద్దాలు ఇస్తున్నారని తెలిపారు. విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిని ఆరు లేన్లుగా మార్చేందుకు మే నెల చివరి నాటికి టెండర్లు పూర్తి చేసి, రెండు సంవత్సరాల్లో పనులు పూర్తి చేస్తామని చెప్పారు.

# గుంతలమయం..

- అలంపూర్ నియోజకవర్గంలో గతుకుల రోడ్లే దిక్కు
- ప్యాచ్ వర్క్‌లతో సరిపెడుతున్న అధికారులు
- కంకర తేలిన రోడ్లపై చోటుచేసుకుంటున్న ప్రమాదాలు

అలంపూర్, జనవరి 5 : రోడ్లపై ఏర్పడిన గుంతలు యమలోకానికి మార్గాలుగా మారాయి. నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో రోడ్లపై గుంతలతో నిత్యం వాహనదారులు, ప్రయాణికులు అనేక అవస్థలు పడుతున్నారు. గుంతల్లో తట్టెడు కంకర పోసి చేతులు దులుపుకుంటున్నారు. గుంతల రోడ్ల కారణంగా ప్రమాదాలు చోటుచేసుకోవడమే కాకుండా అత్యవసరానికి వచ్చే అంబులెన్స్‌లు సైతం ఆయా గ్రామాలకు వెళ్లడం లేదు. నిత్యం అ లంపూర్ పుణ్యక్షేత్రాన్ని దర్శించుకోవడానికి వందలాది మంది తరలివస్తుంటారు. అలాంటి రోడ్లు సైతం గుంతలుగా మారాయి. అలంపూర్ చౌరస్తా నుంచి అలంపూరుకు వెళ్లే రోడ్డు ఎగుడు దిగుడుగా ఉండడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారంలో రోజుల కిందట అలంపూరు చౌరస్తా సమీపంలో రాయచూరు రోడ్డుపై కంకర పోయగా, కంకర రాళ్లపై వెళ్లిన ద్విచక్రవాహనదారుడు అదుపు తప్పి కింద పడి గాయాలయ్యాయి. ఇలాంటి ఘటనలు అనేకం చోటుచేసుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. రాబోవు రోజుల్లో జోగుళాంబ ఆలయంలో నిర్వహించే వసంత పంచమి, మహా శివరాత్రి వేడుకలకు భక్తులు అశేషంగా తరలిరానున్నారు.

ఇప్పటికైనా అధికారులు స్పందించి నియోజకవర్గంలో రోడ్డు మరమ్మతులను పకడ్బందీగా చేపట్టి రోడ్డు ప్రమాదాల నివాణకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.



గుంతల్లో కంకర తేలి ప్రమాదకరంగా మారిన రోడ్డు

## జాతీయస్థాయి కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



కుంగ్‌ఫూ కరాటే పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు

ఎర్రవల్లి చౌరస్తా, జనవరి 5 : జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ఎర్రవల్లి విద్యార్థుల ప్రతిభ కనబర్చారు. హైదరాబాద్ జీడిమెట్లలో ఆదివారం నిర్వహించిన జాతీయస్థాయి కరాటే పోటీల్లో ఎర్రవల్లి విద్యార్థులు పాల్గొని బంగారు, వెండి పతకాలు సాధించారని మాస్టర్లు విజయ్, రాజు తెలిపారు. బాలికల స్పైరింగ్ విభాగంలో నందిని, యక్షిత, లలిత బంగారు పతకాలు సాధించగా, బాలుర స్పైరింగ్ విభాగంలో గోకుల్, కార్తీక్, రాహుల్, హేమంత్, రక్షిత్, రేవంత్‌రెడ్డి, ఉమేశ్, భరత్, మనోజ్, గోపినాథ్‌రెడ్డి, హేమచంద్ర బంగారు పతకాలు సాధించినట్లు తెలిపారు. బాలికల కటాస్ విభాగంలో హేమశ్రీ, శ్రీవల్లి, శాన్విక, స్వేచ్ఛ బంగారు పతకాలు , బాలుర కటాస్ విభాగంలో దినేశ్, కేతన్, వరుణ్‌తేజ్, హరివర్ధన్ బంగారు పతకాలు సాధించినట్లు తెలిపారు. గెలుపొందిన విద్యార్థులకు మాస్టర్లు మహ్మద్, శ్రీనివాసులు, శివకోటి, విజయ్‌కుమార్, శ్రీనివాసులు, బహుమతులు ప్రదానం చేశారు. కరాటే పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు కుంగ్‌ఫూ మాస్టర్ విజయ్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.



పీయూలోని మహిళా వసతి గృహం

# వసతి అధోగతి..!

- పీయూలో సమస్యలతో మహిళల సావాసం
- అధ్వానంగా భోజనం.. మెరుగుపడని సౌకర్యాలు
- నిత్యం వెంటాడుతున్న సమస్యలు
- ఆందోళన చెందుతున్న విద్యార్థినులు

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, జనవరి 5 : పాలమూరు యూనివర్సిటీ వసతిగృహాల్లో విద్యార్థినుల సమస్యలు వర్ణనాతీతం.. తాగునీరు, భోజనం, మరుగుదొడ్లు, వసతి సమస్యలు నిత్యం వెంటాడుతున్నాయని అమ్మాయిలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ అవస్థలను పట్టించుకునే దిక్కులేదని వాపోతున్నారు. కృష్ణవేణి వసతిగృహంలో నీటిశుద్ధి యంత్రం రెండు రోజులు పనిచేస్తే వారం రోజులు మరమ్మతులకు గురవుతుందన్నారు. ఏటా విశ్వవిద్యాలయంలో చదివేవారి సంఖ్య పెరుగుతున్నా వసతి గృహాల్లో సౌకర్యాలు మెరుగుపడడం లేదంటున్నారు.రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి పాలమూరు యూనివర్సిటీలో ఉమ్మడి జిల్లా సహా రాష్ట్రంలోని ఇతర జిల్లాల నుంచి విద్యార్థులు ఇక్కడికి వచ్చి చదువుకుంటారు. వర్సిటీలో మహిళా వసతి గృహం, పీజీ బాయ్స్ హాస్టల్, ఫార్మసీ హాస్టల్, ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ హాస్టల్స్ ఉన్నాయి. ఆరుగురు ఉండాల్సిన గదుల్లో 10నుంచి 12మంది సర్దుకుపోతున్నారు. చాలా గదుల్లో మంచాలు లేవు. గదులైనా సరిగ్గా ఉన్నాయా అంటే అదీ లేదు. కొందరు మంచాలపై పడుకుంటే మరికొందరు నేలపై పడుకోవాల్సిందే. మూత్రశాలలు, మరుగుదొడ్లలో అపరిశుభ్రత తాండవిస్తోంది. ఆహారంలోనూ పూర్తిస్థాయిలో నాణ్యత కొరవడడంతో పలు పర్యాయాలు విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళన చేపట్టారు. యూనివర్సిటీ విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఆవేదన వారి మాటల్లోనే..



విద్యార్థినులు తినకుండా పడేసిన చపాతీలు



నీళ్లచారుకంటే అధ్వాన్నంగా ఆలూ కర్రీ



కుళాయిల వద్ద పేరుకు పోయిన పాకర

### ఫొటోషూట్‌లు చేస్తుండ్రు..



ఎమ్మెల్యేలు, ఎంపీలు, అధికారులు యూనివర్సిటీకి వచ్చి ఫొటోషూట్‌లు చేస్తున్నారే కానీ.. సమస్యలు పరిష్కరించడం లేదు. వచ్చి చూడడం వరకే సరిపోతుంది.. ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్నట్లు ఉంది. బోరు ద్వారా వచ్చే నీటిని నేరుగా అందిస్తున్నారు. అదేమంటే చేస్తాం.. చూస్తాం అని అధికారులు అంటున్నారు. వినతులు ఇచ్చినా, ధర్నాలు చేసినా పట్టించుకోవడం లేదు.

– కృష్ణకుమార్, ఎంఈడీ ప్రథమ సంవత్సరం విద్యార్థి, పాలమూరు యూనివర్సిటీ

### అరకొర సౌకర్యాలతో నిత్యం అవస్థలే..



వసతి గృహంలోని ఒక గదిలో 8 మంది ఉంటే ఒకటి రెండు కార్డ్స్, కప్‌బోర్డులు మాత్రమే ఉన్నాయి. బుక్స్ పెట్టుకునేందుకు సరిపోవు.. మంచాలపై ఇద్దరు ముగ్గురు పడుకోలేక నేలపైనే పడుకోవాల్సిన దుస్థితి నెలకొంది. నెల రోజుల కిందట మంచాలు ఆర్డర్ ఇచ్చామని.. ఒకటి రెండు రోజుల్లో వస్తాయని చెప్పారు. ఇప్పటికీ రాలేదు.

– లక్ష్మి, ఎంఎస్‌డబ్ల్యూ, ప్రథమ సంవత్సరం, పీయూ

### ప్రభుత్వ నిధులు ఎటుపోతున్నాయ్..



గదుల్లో విద్యుత్తు సాకెట్లు పని చేయవు.. వైఫై అని పెట్టారు.. అది సిగ్నల్స్ రావు.. పీజీ అంటే సగం ఆన్‌లైన్ లో చదువుకునేది ఉంటుంది. కానీ నెట్ రాదు.. మళ్లీ ఏదైనా అడిగితే మాపై కక్షసాధింపు చర్యలకు పాల్పడతారు. ఏం చేయాలో అర్థం కావడం లేదు.

– సంగీత, ఎంఏ ఇంగ్లిష్, ప్రథమ సంవత్సరం, పీయూ

### నీళ్లు సక్రమంగా రావు..



నీళ్లు ఒక్కోసారి ఒక్కో రంగులో వస్తుంటాయి. కళాశాలలో జాయిన్ అయిన రోజే డిపాజిట్ రూ.10వేలు చేయించుకున్నారు. అప్పుడే వసతి గృహం చూస్తామంటే ముందు డిపాజిట్ చేశాకే లోపలికి రమ్మన్నారు. అకాడమిక్ విద్యా సంవత్సరం ప్రారంభమైనా.. అధికారులు సమస్యలు పరిష్కరించడం లేదు. విద్యుత్ పోతుంటుంది. దోమలు మస్తు ఉన్నాయ్.. ఎక్కడ అనారోగ్యానికి గురైతామని.చాలా భయమేస్తోంది.

– శ్రావణి, ఎంబీఏ ప్రథమ సంవత్సరం, పీయూ

## ఢిల్లీ వరల్డ్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

వనపర్తి టౌన్, జనవరి 5: హైదరాబాద్‌లోని చింతల్‌లో జరిగిన ఇంటర్ స్కూల్ రోలర్ స్కేటింగ్ పోటీల్లో వనపర్తి జిల్లా కేంద్రంలోని ఢిల్లీ వరల్డ్ స్కూల్ విద్యార్థులు పాల్గొని ప్రతిభ చాటినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ తెలిపారు. పాఠశాలకు చెందిన గౌతమ్ సాయి , అఖిల్‌లు రోలర్ స్కేటింగ్ పోటీల్లో పాల్గొని బ్రాంజ్ మెడల్ సాధించినట్లు ఆయన చెప్పారు. విద్యార్థులు మెడల్స్ సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు.

## నూతన వంశరాజ్ సంఘం ఏర్పాటు

మదనాపురం, జనవరి 5 : మండలంలోని తిరుమలాయపల్లి గ్రామంలో ఆదివారం మదనాపురం మండలం వంశరాజ్ సంక్షేమ సంఘం ఏర్పాటు చేశారు. గౌరవ అధ్యక్షుడిగా రాసని వెంకటస్వామి, సలహాదారులుగా పాశం సత్యనారాయణ, అధ్యక్షులుగా పాశం లక్ష్మన్న, ప్రధాన కార్యదర్శిగా పాశం కురుమూర్తి, ఉపాధ్యక్షులుగా రాసని ఎల్లయ్య, కార్యదర్శిగా రాసని కురుమూర్తి, సంయుక్త కార్యదర్శి గంగాధర్, కార్యదర్శులుగా రాజేశ్, నరేశ్, రాజశేఖర్, దేవేందర్, వెంకటేశ్, రవీంద్ర, మహిళా కార్యదర్శులు నాగశేషమ్మ, అలివేలు ఎన్నికయ్యారు.

## బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

పెద్దమందడి, జనవరి 5: మండలంలోని పామిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన పానుగంటి పెంటయ్య ప్రమా దవశాత్తు మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీపీ మన్యపురెడ్డితో పాటు బీఆర్‌ఎస్ నాయకులు మృతుని ఇంటికి వెళ్లి పార్థివదేహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు రవీందర్‌రావు, లక్ష్మణ్‌గౌడ్, గోవర్ధన్‌రెడ్డి, ఆనంద్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

## లారీ కిందకి దూకెళ్లిన కారు

- అక్కడిక్కడే ఇద్దరి దుర్మరణం

చారకొండ, జనవరి 5: వెల్దండ మండల కొట్రకు చెందిన శ్యాంపురి గణేశ్(30), కల్వకుర్తి మండల తాండ్రకు చెందిన రామకోటి (36) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానలో పీఆర్‌వోలుగా పని చేస్తున్నారు. రామకోటి పెళ్లి చూపుల కోసం స్నేహితుడు గణేశ్‌ను తీసుకొని కారులో వెళ్లి తిరిగి వస్తుండగా, ముందుగా వెళ్తున్న సిమెంట్ లారీ కిందికి కారు దూసుకెళ్లింది. కారు లారీ కింద ఇరుక్కొని నుజ్జునుజ్జయ్యింది. ఘటనా స్థలానికి చారకొండ, వంగూరు ఎస్సైలు శంషాద్దీన్, మహేందర్ చేరుకొని మృతదేహాలను బయటకు తీశారు. గణేశ్‌కు భార్య శివలీల, ఇద్దరు పిల్లలున్నారు. పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.